# మధుర భావన-17

'నిజమా....దిగ్భ్రాంతి తో గట్టిగా అరిచాననుకున్నాడు కానీ, వంశీ గొంతు కీచుగా ధ్వనించింది. ఎలా జరిగింది...ఇదంతా ! ఎప్పటినుంచో అనుకుంటుంటే తప్ప..ఇప్పటికిప్పుడు కృష్ణమోహన్ తో ఇంత త్వరగా ముహూర్తం నిర్ణయించటం సాధ్యమా ? ఎప్పుడో ఎవరో పెళ్ళిచూపులకి వస్తామని చెపితే, అతని పేరు కృష్ణమోహన్ అని విని తనే అనుకుని పొరబడ్డానని తనకి సుమజ చెప్పింది. మరి ఎలా..ఇంత త్వరగా తమ విషయం తిలోత్తమ చెప్పగానే ఆ అబ్బాయితో పెళ్ళి ఖాయం చేసేసారు. అంటే...అంటే...సుమజ తనపై కురిపిస్తున్న ప్రేమానురాగాలు మొత్తంగా తన స్వంతం కాదా..ఇన్నాళ్ళూ తను చవిచూస్తున్న అవాజ్యమైన ప్రేమ నిజం కాదా ..?!' అవేదనతో అతని మనసు నిండిపోయింది. తిలోత్తమ మాత్రం పకాపకా నవ్వుతూ...'నేనున్నాగా బావా...ఎందుకు అంత కలత పడుతున్నావు ? మనకీ వార్త మంచిదేగా...ఇక మనకెవ్వరూ అడ్డు లేరు...నువ్వే మాత్రం గిల్టీగా ఫీల్ అవ్వనక్కరలేదు కూడానూ..' అని సంబరపడింది.

' నువ్వెందుకు బాధ పడుతున్నావ్ ? నీకా అర్హత వుందా అసలు ? నిజానికి నువ్వు చేస్తున్నదేమిటి ? నిన్ను ప్రేమించిన సుమజ తిలోత్తమ వల్ల బాధపడి, భంగపడి వెళ్ళిపోతే, కనీసం తనకి వివరించి చెప్పాల్సిన భాధ్యత కూడా నీ మీద లేనట్టు ఉన్నావు కదా...నీకీ శాస్తి జరగాల్సిందే...' లోలోపల్నించి అంతరాత్మ బిగ్గరగా నిలదీస్తుంటే.... ఉలిక్కిపడి, దిగ్గున లేచి కూర్చున్నాడు వంశీ. ఒళ్ళంతా చెమటలు దిగకారుతున్నాయి. విపరీతమైన దాహం. టైము చూస్తే..రాత్రి 11 గంటలు దాటినట్టుంది...కొంతసేపు ఏం జరుగుతుందో అర్ధంకాలేదు. ' అమ్మయ్య..ఇదంతా కలా ! ' అనుకున్నాడు. మళ్ళీ వెంటనే...' ఇదే జరగబోయేదీ ' అనుకోగానే మనిషి నిలువెల్లా వణికిపోయాడు. అలా సుమజ గురించి ఆలోచిస్తూ నిద్రలోకి జారుకున్నాడేమో , ఇలాంటి భయంకరమైన కల వచ్చిందీ, అనుకున్నాడు. ఇంతలో రేపు ఉదయం అమ్మతో 'తిలోత్తమతో తన పెళ్ళి నిర్ణయం' చెప్పాలని కూడా అనుకున్నాడని జ్ఞాపకం వచ్చింది. గుండె ఇంకా బరువెక్కింది. 'తప్పదు అమ్మ కోసం...అమ్మను మునపటిలా ఆరోగ్యవంతురాలిగా చూడటం కోసం, ఇలా చేయాల్సిందే..వేరే దారి లేదు' అని గుండె దిటవుపరుచుకున్నాడు. కానీ ఈ విషయం సుమజ కి వివరంచి చెప్పాల్సిన భాధ్యతను, ఈ కల చెప్పకనే చెప్పింది....ఆ ఊహ రాగానే, ఇంక నిద్రపోలేకపోయాడు.

వెంటనే లేచి టేబుల్ ముందు కూర్చుని, సుమజకి ఉత్తరం రాయటం మొదలుపెట్టాదు.

సుమజా.....

ముందుగా నన్ను క్షమించు. నీతో సంప్రదించకుండా ఇలాంటి నిర్ణయం తీసుకున్నందుకు.

ప్రస్తుతం నేను చాలా గందరగోళం లో వున్నాను..నువ్వు దయచేసి ప్రశాంతంగా ఈ ఉత్తరం చదువు. ఈ రోజు అన్ని విషయాలూ నీతో పంచుకోవాలనిపిస్తుంది. ఫోన్ చేసి మాట్లాడవచ్చునుగానీ...ఎందుకో నా మనసులోని మాటలన్నీ పంచుకోవటానికి ఇదే సరైన పద్ధతిగా నాకు అనిపించింది. అవును సుమా....నీ కంఠస్వరం వింటూ..నీతో సరదాగా

మాట్లాడటం ఎంత ఆహ్లాదంగా వుంటుందో...ఇలా మనసు బాగోలేనపుడు నీతో మనసు విప్పి చెప్పుకుంటున్నట్లుగా ఉత్తరం రాయటమూ అంతే బావుంటుందనిపిస్తోంది !

ఇలా ఉత్తరం రాయాలనే కోరిక కలగటానికి కారణం మా అమ్మే ! చెబితే నువ్వు నమ్మవేమోగానీ , ఇంట్లో వున్నప్పుడే ఎక్కడో దూరంగా వున్నవాడికి రాసినట్లుగా మా అమ్మ ఒకసారి నాకు ఉత్తరం రాసింది ! తమాషాగా అనిపిస్తోంది కదూ ! ఆ ఉత్తరాన్ని చూసినపుడు నాకూ అంతే...చాలా సరదాగా, ఉద్వేగంగా అనిపించింది ! పూర్తిగా చదివాక మనసులోనే ఎగిరి గెంతులు వేసా ఆనందంతో ! అమ్మ రాసిన ఉత్తరంలోని 'నా వంశీ' అన్న సంబోధనకే నాకెంత పిచ్చి ఆనందం కలిగిందో..! ఆ అక్షరాల చుట్టూ నా చూపులు ఎన్నిసార్లు గింగిరాలు తిరిగాయో మరి! ఇప్పటికీ ఆ ఉత్తరం నా దగ్గర భద్రంగా ఉంది! ఆ రోజుల్లో అయితే గీతాపారాయణంలా రోజుకు రెండుసార్లు అయినా ఆ ఉత్తరం చదివేవాడిని ! చదివినప్పుడల్లా నాకేదో కొత్త శక్తీ, బలం కలుగుతూండేవనిపించేది !

నేను కాలేజీలో చేరిన సంవత్సరమే అనుకుంటా...అమ్మ తను రాసిన ఉత్తరాన్ని లంచ్ బాక్సు పెట్టి ఇచ్చే కవరులో ఉంచింది. ఎందుకు రాసిందో కూడా చెబుతా. హైస్కూల్ లో వున్నప్పుడు ప్రతీ సంవత్సరం క్లాసులో నాదే ఫస్టు ర్యాంకు. కానీ కాలేజీ కి వెళ్ళాక చదువు కొంచెం వెనకబడి మార్కులన్నీ బాగా తక్కువగా వచ్చాయి ! అది చూసి అమ్మ బాధ పడుతూ, నాకు ఉత్సాహాన్ని కలిగిస్తూ ఆ ఉత్తరం రాసిందన్నమాట !

'సరదాలు, స్నేహితులతో కాలక్షేపాలూ ఏవీ తప్పు కావు. అవసరమే. అయితే చదువనేది వాటిన్నటికంటే ముఖ్యమైనది. దేనికెంత సమయం కేటాయించాలో తెలుసుకోగలగాలి. అపుడే ఏ సమస్యా ఉండదు ! నువ్వు చదువుకుంటున్నంతసేపూ నీ దగ్గర కూర్చోవాలనే నా అభిప్రాయాన్ని వదులుకున్నాను. ఎందుకో తెలుసా....చదువుకునేప్పుడు ఏదో నిఘా పెట్టినట్లుగా, ఎవరి నియంత్రణలోనో ఉన్నట్లుగా అనిపించి, చదువు మీద దృష్టి సరిగా పెట్టలేనని నువ్వు చెప్పటంవలనే. నీ మాటల్లోని నిజాన్ని గ్రహించి...నీ అభిప్రాయానికి విలువిచ్చి..ఆ పని చేయలేదు ! మరి నీ మాటలకు, అభిప్రాయానికీ అంత విలువ, గౌరవం ఇచ్చిన నాకూ నువ్వు అలానే ఇవ్వాలి కదా ! మా అబ్బాయికి మంచి మార్కులు రావాలనే మా ఆశను నెరవేర్చాలనే అభిప్రాయం నీకు లేకపోతే ఎలా..? తప్పే కదూ ? తెలుస్తోందా ? నాకు తెలుసు...నువ్వు అనుకుంటే ఏదైనా సాధించగలవని ! అందుకే ...మునపటి స్ఫూర్తిని పోగొట్టుకోవద్దని హెచ్చరిస్తున్నా ! ఆనందమనేది కేవలం ఆటపాటల్లోనే కాదు, చక్కగా చదువుకోవటంలోనూ ఉంటుంది ! అది నీకూ తెలుసు ! ఆ విషయం మరిచిపోవద్దని గుర్తు చేయాలన్నదే నా తపన, తాపత్రయం ! ' ఇలా అమ్మ ఉత్తరం సాగింది! ఆ ఉత్తరంలోని కొన్ని సంగతులు మాత్రమే ఇవి. నాకు మార్కులు బాగా రానందుకు తను ఎంతగా చింతిస్తుందో చెబుతూనే, ఆ వయసులో చదువు పట్ల చూపించాల్సిన శ్రద్ధనీ వివరిస్తూ హెచ్చరించింది !

ఆ ఉత్తరం చదివాక, అమ్మ నాకు ఇచ్చిన స్వతంత్రాన్ని దుర్వినియోగం చేయకూడనీ, మంచి మార్కులు తెచ్చుకుని అమ్మా నాన్నల ఆశలను నెరవేర్చాలనే సంకల్పమూ కలిగింది ! అప్పటినుండీ చదువు సంధ్యలకూ, ఆటపాటలకూ

సమయాన్ని విభజించుకుని ఖచ్చితంగా పాటించే అలవాటు చేసుకోగలిగాను! అమ్మ తన ఉత్తరం ద్వారా నాలో ఆలాంటి మార్పును సాధించింది!

అంతేకాదు ఆ తర్వాత కూడా...రాత్రిళ్ళు నా దగ్గర పడుకుని, మార్కుల ప్రస్తావన తేకుండా, ఎన్నో మంచి స్ఫూర్తి ని కలిగించే విషయాలు చెబుతూ ఉండేది...

" ప్రయత్న లోపం లేకుండా ఉండాలి! అపుడు..అపజయం ఎదురైనా మనం బాధ పడకూడదు. పెద్దవాళ్ళు ఏం చెప్పారో తెలుసా...ఓటమి అనేది ప్రయత్నం చేయకపోవటంలో మాత్రమే ఉంటుందట ! అందుకే ఒకసారి ఓటమి చెందినా నిరాశ పడనక్కర్లేదనీ, విజయానికి ఆ ఓటమి అనేది ఓ మెట్టుగా ఉపయోగిస్తుందనీ అన్నారు. తియ్యని మామిడి పండు కూడా ఆ దశకు చేరే క్రమంలో వగరుగానూ ఉంటుంది. అలానే గొంగళీ పురుగు కూడా దశలవారీగా రూపు మార్చుకుని సీతాకోకచిలుకగా మారుతుంది ! నిరాశావాదికి సుఖాల్లో సైతం కష్టాలు కనిపిస్తాయి. ఆశావాదికి కష్టాల్లోనూ అవకాశాలు కనిపిస్తాయి ! " అని చెబుతూంటే..." అవునమ్మా...ధర్మరాజుకి దుర్మార్గులు దొరకలేదట...దుర్యోధనుడికి మంచివారు కనిపించలేదట ! అంతా మన దృష్టికోణం బట్టే ఉంటుందని మా మేష్టారు చెప్పారు...!"

వెంటనే ఒక క్షణం ఆగి మళ్ళీ అడిగాను..." అమ్మా..నువ్వేమి చదువుకున్నావు, ఎన్ని విషయాలు తెలుసో నీకు " అన్నాను ఆరాధనగా చూస్తూ.

అమ్మ చిరునవ్వుతో..."క్లాసులో మేష్టార్లు మాత్రమే చెప్పనక్కరలేదు...మంచి మంచి పుస్తకాలు చదివే అలవాటుంటే, మనకి ఎన్నో విలువైన విషయాలు తెలుస్తాయి ! ఆ పైన పెద్దవాళ్ళకి కొన్ని అనుభవాల ద్వారా మంచి విషయాలు తెలుస్తాయి. నాకు మాత్రం పెద్ద గురువు మీనాన్న గారే ....పెళ్ళి అయ్యేటప్పటికి పెద్దగా చదువుకోకపోయినా...మీ నాన్న దగ్గరుండి, పట్టుబట్టి నన్ను డిగ్రీ కట్టమని ప్రోత్సాహించి.. దగ్గరుండి పట్టా తెప్పించారు ! ఆయన మీద ఉండే గౌరవంతో కాదనలేక ముందు మొదలుపెట్టినా...ఆ తర్వాత చదువుకూ ఒక రకంగా బానిస అయిపోయానునుకో. 'నన్ను కూడా పట్టించుకోవట్లేదు నువ్వూ' అని అప్పుడప్పుడూ మీ నాన్న అలిగేవారు కూడా..." అమ్మ మొహంలో ఆ మాటలు చెబుతున్నప్పుడు..ఒక రకమైన గర్వం...మురిపెం !

అంతేకాదు.. నాన్న, అమ్మ పరీక్షలప్పుడు, తను టెన్షన్ పడకుండా...పక్కన కూర్చుని ఏవేవో జోక్స్ చెప్పి నవ్విస్తూ ఉండేవారట ! అలా అమ్మ చెప్పిన వాటిల్లో కొన్ని నాకు గుర్తున్నవి చెబుతా...

మొదటిది ఏమిటంటే...ఒక డాక్టరు తన దగ్గరకు వచ్చిన పేషంటుతో...'మీరు బాగా నీరసంగా కనిపిస్తున్నారు, నేను రాసిన మందును మూడుపూటలా తీసుకోండి' అన్నాడు. అందుకతను వినమ్రంగా 'ఈ మాట ముందు మా ఆవిడకు చెప్పండి డాక్టరుగారూ... ప్రతీరోజూ నన్ను మందు తాగటం మానేయమని గోలపెడుతుందీ' అన్నాడు. అపుడు నిర్ఘాంతపోవడం డాక్టరు వంతయింది.

ఇంకోటి... లాటరీలో 50 లక్షల బహుమతి గెలుచుకున్న వెంగళప్పతో లాటరీ నిర్వాహకుడు ' అంతా ఒక్కసారే ఇవ్వలేము కాబట్టి ముందుగా పది లక్షలిచ్చి మిగతావి నెమ్మదిగా ఇస్తానూ' అని చెప్పగానే మన వెంగళప్ప కోపంగా 'నేనంత వెర్రివాడిలా కనిపిస్తున్నానా..అంతా ఒక్కసారే ఇవ్వలేకపోతే ఈ లాటరీ టిక్కెట్టు నాకెందుకూ..నీ మొహం మీద కొడతా, నా టిక్కెట్టు ఖరీదు పది రూపాయిలూ నాకిచ్చేయ్యి' అన్నాడట !

ఎలా ఉన్నాయి సుమా..నేను చెప్పిన జోక్స్  'నీ పెదవులపైకి చిన్న చిరునవ్వు అయినా వచ్చేవుంటుంది ! అవునా..?'  అలా నాన్న చెప్పినవీ అన్నీ అమ్మ నాతో చెప్తూ వుండేది. మన పరిచయం జరిగిన ఆ ఫంక్షన్ లో కూడా జోక్స్ చెప్పే ప్రోగ్రాం ఏర్పాటు చేసారు కదా...అప్పుడు అనుకున్నా. నాన్న లాగే ఆయన ఫ్రెండ్స్ కి కూడా ఈ అలవాటు ఉంది కాబోలని !

అలా అమ్మ..నేనూ స్నేహితుల్లా కబుర్లు చెప్పుకోవటం చిన్నప్పటినుంచీ ఒక అలవాటు.  నేను కూడా అమ్మంటే చాలా ఇష్టంగా, పొసెసివ్ గా వుండేవాడిని. అమ్మ ప్రేమ అంతా నాకే దక్కాలనే ఆరాటం ఉండేది. కానీ, అనూష.. నాన్న మీద తను చూపించే ప్రేమ మళ్ళీ ఇష్టంగా ఉండేది. వీళ్ళిద్దరూ తప్ప, ఇంకెవరిమీదైనా అమ్మ కొంచెం ఎక్కువ శ్రద్ధ చూపించినట్టు అనిపిస్తే అలిగేవాడిని కూడా. అదేమిటో కథలూ, సినిమాలలో కూడా ఎప్పుడైనా, ఎవరికైనా అమ్మంటే విపరీతమైన ఇష్టం, ప్రేమ ఉన్నట్టు చూపిస్తే కూడా నాకు నచ్చేది కాదు. నీకు నవ్వు వస్తుందేమోకానీ, నిజంగానే అలానే ఉండేవాడిని. మా అమ్మ లాటి అమ్మ ఇంకెవరికీ ఉండదని నాకో గొప్ప నమ్మకం. అందుకేనేమో అందరు అమ్మలు గొప్ప వ్యక్తులు అంటే నాకు నచ్చేదికాదేమో మరి.

ఒకసారి నాకు బాగా గుర్తుంది. చిన్నప్పుడు సాగర్ అనే నా ఫ్రెండ్ ఒకడు బాగా బొమ్మలు గీసేవాడు. ఒకసారి వాడు నా బొమ్మ గీసాడు. చాలా బాగా వచ్చింది. టీచర్స్, స్నేహితులు అందరూ వాడిని చాలా బాగా వేసావని మెచ్చుకున్నప్పుడు నాకూ సంతోషం వేసింది కానీ, అమ్మ వాడిని తెగ మెచ్చుకుని, వెంటనే లోపలకు వెళ్ళి...నాకిష్టమని చేసిన రవ్వకేసరి స్వీటు తీసుకువచ్చి సాగర్ కి తినిపిస్తుంటే, ఎందుకో నేను సంతోషించలేకపోయాను. బయటపడలేదుగానీ, రెండురోజులు చాలా ముభావంగా ఉండిపోయాను. అమ్మకి నేనంటేనే ఇష్టం ఉండాలని పంతంగా ఉండేది.     కానీ అమ్మ అందరితో సరదాగా ఉంటే, అందరంటే ఇష్టంగా ఉంటే నాకు నచ్చదని తెలిసింది. నేను ముభావంగా వుంటే అమ్మకి మాత్రం తేడా వెంటనే తెలిసింది. రెండో రోజు నా దగ్గర కూర్చుని ఆరా తీసేసరికి, నేను ఉక్రోషంతో బయటపడిపోయాను. ' నేనూ బొమ్మలు గీయడం నేర్చుకుంటానమ్మా....సాగర్ కన్నా బాగా వేస్తాను. అప్పుడు నేనే ఎక్కువ ఇష్టం అవుతాను కదా, నీకూ అన్నాను కళ్ళల్లో నీరు తిరుగుతుండగా. అమ్మ వెంటనే నన్ను అక్కున చేర్చుకుంది. ' పిచ్చి కన్నా..నీకన్నా నాకెవ్వరూ, ఎక్కువ కాలేరురా...ఎన్ని ప్రతిభలు వున్నా సరే. కానీ సాగర్ అంటే ఆ రోజు ఎందుకు అంత ఇష్టంగా అనిపించిందో చెప్పనా...వాడు గీసింది నీ బొమ్మ కాబట్టి. నీ రూపం చూడగానే నాకు అంత ప్రేమ వచ్చేస్తుందిరా, మరి నేను ఏం చెయ్యనూ? నీ మీద ఇష్టం, శ్రద్ధా..చూపించే వాళ్ళందరూ ..నాకూ అంత ఇష్టం అయిపోతారు అన్నమాట ! అర్థమైందా ! పెద్దయ్యాక..నీకు పెళ్ళి అయి, భార్య వస్తుంది కదా...అప్పుడు నువ్వు అమ్మను మర్చిపోయినాగానీ,

నేను మాత్రం, నిన్ను అంత శ్రద్ధగా చూస్తూ...అమ్మనే మరిపించేంత ప్రేమని నీ మీద చూపిస్తున్నందుకు, నీ భార్యని కూడా ఇష్టపడతాను.." అంది మెరిసే కళ్ళతో.

'నిజంగానా అమ్మా...అయితే సాగర్ బాగా బొమ్మలు వేస్తాడని కాదా, నీకిష్టం..' అని మళ్ళీ అడిగాను అమాయకంగా. అమ్మ వెంటనే తల అడ్డంగా ఊపుతూ...' సాగర్ లోని కళను ఇష్టపడలేదురా...వాడు గీసిన బొమ్మనే ఇష్టపడ్డానూ అని చెప్పేసరికి నాకు ఏనుగెక్కినంత సమబరం ! రెండు రోజుల బాధా ఎవరో ఊదేసినట్టు అయి, అమ్మని ఇష్టంగా చుట్టేసాను.

ఇలా చెప్పుకుంటూ పోతే...ఎన్నెన్నో జ్ఞాపకాలు...

సుమా...నాకే సమస్య వచ్చినా, ఆనందం కలిగినా అన్నీ అమ్మతో పంచుకోవటం నాకు ఎంతో స్వాంతననీ, సంతోషాన్నీ ఇస్తుంది ! అలాంటిది...ఇప్పుడు అమ్మతోనే సమస్య వచ్చింది, తన అనారోగ్యరూపంలో. ఇక నాకు స్వాంతన కలిగించేది ఎవరూ...నువ్వే మరి ! అందుకే ఈ ఉత్తరం! అమ్మ తర్వాత అంతటి అనుభంధం ఏర్పడింది నీతోనే సుమా...నిజం ! "...అలా రాస్తూ రాస్తూ...ఎప్పుడు నిద్రలోకి జారుకున్నాడో తెలియలేదు వంశీ కి.

పొద్దున్నే తిలోత్తమ తలుపు తట్టిన చప్పుడికి ఉలిక్కిపడి లేచి తలుపు తీసాడు. ' బావా...అత్తయ్య దగ్గరకి వెళ్దాం అన్నావ్ గా'...అనగానే 'వెంటనే రడీ అయి వస్తా' అన్నాడు వంశీ.

తర్వాత వాళ్ళిద్దరూ రడీ అయి, బయటకెళ్ళాలని అనుకుంటున్నపుడు... వంశీ తిలోత్తమతో అన్నాడు. "కాసేపు కూర్చో. నేనో చిన్న కథ చెబుతాను. వింటావా...?" అనడిగాడు.

తిలోత్తమ చాలా ఉత్సాహం చూపించింది. "చెప్పు చెప్పు... నాకు కథలంటే ఇష్టమే. అయితే ఒక కండిషను... ప్రేమ కథే అయివుండాలి...!"

ఆ మాటలకు వంశీ "ఏ కథలోనైనా ప్రేమ లేకుండా ఉంటుందా...?" అనడిగాడు.

"అదేమిటీ... చాలా రకాలు ఉంటాయిగా...?" తిలోత్తమ ఎదురుప్రశ్న వేసింది.

"ఏమో... నా ఉద్దేశ్యం ప్రకారం అయితే ప్రేమ లేకుండా ఏ కథా ఉండదు! అయితే ఆ ప్రేమ యువతీ యువకుల మధ్య ఉండొచ్చు. లేదా తల్లీ పిల్లల మధ్య, సమాజం పట్ల, పేదల పట్ల... ఇలా రకరకాలుగా ఉండొచ్చు కదా! ప్రేమ లేనిదే మనిషి మనుగడే లేదు....!"

తిలోత్తమ పకపకలాడింది... "నువ్వు చెప్పేది బాగానే ఉంది గానీ, యువతీ యువకుల మధ్య సాగే ప్రేమ కథలే నాకిష్టం... అని నా ఉద్దేశ్యం...!"

"ఆ యవతీ యువకులు తల్లి దండ్రుల ప్రేమని అనుభవించిన వాళ్ళేగా అందుకని... తల్లీ బిడ్డల ప్రేమను గురించే కదా ముందుగా చెప్పుకోవాలి!"

“సరేలే... నువ్వన్నట్లుగా... తల్లిదండ్రులు కూడా యువతీ యువకులుగా ప్రేమ సాగించాకనే కదా పిల్లలకు అమ్మా నాన్నలవుతారు. అందుకని ఎటుదిటు అయినా ఒకటే! సరేగానీ, కథ మొదలు పెట్టూ...” అంది తిలోత్తమ.

“సరే... చెబుతానుండు...” అంటూ వంశీ మొదలు పెట్టాడు.

“రెండు రామ చిలుకలకు పరిచయం కలిగింది. ఆ తరువాత చనువూ పెరిగింది. ఒక చిలుక పలుకులకు పరవశం చెందిన రెండో చిలుక...”

వంశీ చెబుతూ ఉండగానే తిలోత్తమ చిరాకు చూపించింది.

“ఏమిటిది బావా... ఏదో చక్కని ప్రేమ కథ చెబుతావనుకుంటే... పక్షుల గురించి... పంచతంత్రంలాంటి కథ మొదలుపెట్టావ్... నేను వినను... వద్దు...!” అంది ఖచ్చితమన్నట్లుగా.

వంశీ నిట్టూర్చి “సరేలే... అయితే...!” అంటూ “ అమ్మకి మన విషయం ఇన్నాళ్ళూ చెప్పలేదనే బాధగా వుంది...అందుకే ఈ రోజైనా చెప్పాలనీ....” మళ్ళీ అన్నాడు వంశీ.

వెంటనే తిలోత్తమ హుషారుగా వంశీ మాటలకు మురిసిపోతూ బయల్దేరింది.

* * *

శ్యామసుందరి మంచానికి దగ్గర్లోనే ఉన్న రెండు కుర్చీలలో వంశీ, తిలోత్తమ కూర్చున్నారు. శ్యామసుందరి మంచంపై అటువైపు తిరిగి పడుకుని ఉంది.

తిలోత్తమ “బావా... అత్తయ్య విశ్రాంతి తీసుకుంటున్నట్లుగా పడుకుని వుంది. మనం ముందు అలా బయటకు వెళ్దాం...!” అంది.

వంశీ కూడా తలవూపుతూ “అంతేనంటావా..అలాగే... నువ్వెక్కడికి అంటే, నేనేం ఎదురు చెప్పకుండా నీ వెంట వస్తాను. ఎక్కడికి వెళ్దామో నువ్వే నిర్ణయించి చెప్పు...!” అన్నాడు.

తిలోత్తమ “ అదేం కాదు బావా... నువ్వేదంటే అదే నేనూ...!”అంది.

వంశీ వెంటనే అన్నాడు... “నాకూ అంతే డియర్...! నీ సంతోషమే నాది తెలుసా?”

తిలోత్తమ ఆనందంతో మెలికలు తిరిగింది.

శ్యామసుందరి మెల్లగా ఇటుపక్కకు తిరిగింది.

ఇద్దరివైపూ నిర్లిప్తంగా చూసింది.

వంశీ ఏదో అనబోతోంటే... తిలోత్తమ మెల్లగా చూపులతోనే శ్యామసుందరివైపు చూపిస్తూ సైగ చేసింది. దానికి వంశీ మెల్లగానే సమాధానం చెప్పాడు “ఏం ఫరవాలేదు. అమ్మ నన్ను గుర్తుపట్టటమే లేదు... మనం ఏం చెప్పుకుంటే మాత్రం ఏమిటిలే...!”

“కానీ... నన్ను అత్తయ్య గుర్తుపట్టిందిగా...!” అంటూ తిలోత్తమ లేచి శ్యామసుందరి పక్కన కూర్చుని అడిగింది “అత్తయ్యా... ఇతను నాకు నచ్చాడు. త్వరలోనే మేం పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాం...! ఏమంటావూ...?“

ఆవిడ వద్దన్నట్లుగా చూస్తూ తల అడ్డంగా వూపింది.

తిలోత్తమ కొంచెం ఆశ్చర్యంగా చూస్తూ “ఏం... ఎందుకనీ ? మనిషి బావున్నాడు. బాగా చదువుకున్నాడు. నీకెందుకు నచ్చలేదూ...?” అనడిగింది.

ఆవిడ తిలోత్తమ వైపు తీవ్రంగా చూసి “అయినా సరే... వద్దంటున్నాగా...!” కొంచెం పెద్దగా అంది. వంశీ వెంటనే కుర్చీలో నుండి లేచి నిలబడి తిలోత్తమ చేయి పట్టుకున్నాడు. “డార్లింగ్... ఎవరో వద్దంటే మాత్రం... మనం ఎందుకు మానేయాలీ ? మన ఇద్దరికీ ఇష్టమవటమే ముఖ్యం...! మన పెళ్ళి తప్పకుండా త్వరలోనే జరుగుతుంది! నువ్వు చెప్పినట్లుగా మాత్రమే నేను చేస్తాను! ఈ రోజు డాక్టరుగారితో మాట్లాడాను. ఆయన అమ్మకి బాగయినట్లుగా పత్రం రాసి ఇస్తానని అన్నారు. ఇంటికి తీసుకెళ్ళిపోవచ్చని చెప్పారు కూడా! అయినా మనం మాత్రం అమ్మ ఆరోగ్యం కోసమని ఎంతకాలమని ఎదురుచూస్తూ కూర్చుంటాం...? పెళ్ళిని వాయిదా వేయటమూ సమంజసం కాదని నాకూ అనిపించింది! అందుకే... అమ్మని ఇంటికి తీసుకెళ్ళి... ఆ స్థలం మా అనూష పేర రాయించి, మనమిద్దరం పెళ్ళి చేసేసుకుందాం డార్లింగ్...!”

వంశీ మాటలకు శ్యామసుందరి చురుక్కున చూసింది.

లేచి నిలబడి వంశీవైపు తీవ్రంగా చూసి “ఏమంటున్నావూ...?” అంది.

వంశీ విస్మయంగా చూశాడు. మెల్లగా “ తిలోత్తమని పెళ్ళి చేసుకోవాలనే నిర్ణయానికి వచ్చానూ...!” అంటూ నసిగాడు. అంతే...ఆవిడ కోపంగా వంశీ షర్టును పట్టుకుంది.